# మనసులేని మార్గాలు

మనసుంటే మార్గం వుంటుందన్నారు. (వైదేశికమే అనుకోండి, వేర్ దేరీజ్ ఎ విల్ దేరీజ్ ఎ వే అని). అయితే ఈ సత్యం తిరగేస్తే రుజువవుతుందా అని నా అనుమానం. అదే మార్గా లేర్పరచినంత మాత్రంచేత మనసు వున్నట్టా అని !

మా వూరు ఈ మధ్య పట్నం స్థాయినుంచి నగరం స్థాయికి ఎదిగింది. పాలనా రంగంలోకి కొత్త మొహాలు ప్రవేశించాయి. "ఎలుగుబంటి తోలు ఎన్నాళ్ళు వుతికినా నలుపు నలుపేకాని తెలుపు రాదు" అన్న సూక్తి ప్రకారం పంచాయితీ అయినా, పట్నమైనా, నగరమైనా కుళ్ళూ మురికి దుర్గంధం నాగరిక లక్షణాలే, వాట్ని ఎవరూ "వైపాఫ్" చెయ్యలేరు !

ఆ మధ్య ఒక విదేశీయుడు భారతదేశం అంతా రైల్లో ప్రయాణంచేసి, "ఇండియా ఈజ్ ఎ బిగ్ లెట్రిన్ !" అన్నాడట. అతను రైల్లో వెడుటాండగా కనబడ్డ దృశ్యాలు చూసి అతనలా భ్రమ పడి వుండొచ్చులే అని కొట్టిపారేడానికి వీల్లేని స్టేట్‌మెంట్ అది. నాగరీకం అంటేనే ఇంటా బయటా కుళ్ళూ దుర్గంధం మురికీ అయిపోయింది. ఈ నిజంనుంచి తప్పించుకోడానికి మరీ పెద్ద నగరాలలో కుళ్ళ ప్రాంతాలు అనడానికి స్లమ్ ఏరియాస్ అని కొన్నిటిని శాంతియుత సహజీవన సిద్ధాంతంతో కలిపేసుకున్నాం. స్లమ్స్ నిర్మూలన ఒక కార్యక్రమంగా రూపొంది, కొంతమంది అధికారులకీ అనధికారులకీ ఉపాధి కల్పించడం, ప్రణాళికలలో మురికివాడల నిర్మూలనకి నిధులు కేటాయించడం ఒక పురోగతిగా ఇటీవల రూపొందింది.

పాత జోకొకటి వుంది.

ఒక వూళ్ళో అత్యంత మిక్కిలి సమర్థుడైన డాక్టరొకాయన వుండేవాట్ట. ఆయనకో క్లినిక్కూ ఎటాచ్‌డ్ నర్సింగ్‌హోమూనుట. పాతకాలం నాటి పల్లెటూరి రైతు తన కొడుకు కూడా తనలాగానే బంగారుభూమి (ది గుడ్ ఎర్త్)ని నమ్ముకుని వృద్ధిలోకి రావాలని కోరుకున్నట్టే ఈ డాక్టర్‌గారు తన కొడుకు కూడా డాక్టరే కావాలని అతగాడికి మెడిసిన్ చెప్పించాడట. కొంతకాలంపాటు తనతోబాటే క్లినిక్ పనీ నర్సింగ్‌హోం పనీ చేయిస్తూ వో పదిహేను రోజులపాటు చిన్న యాత్ర కెళ్ళొచ్చాడట. ప్రాక్టీసంతా కొడుకుమీద వదిలి, అట్నుంచి రాగానే ఏంటి బాబూ! విశేషాలని కొడుకుని అడిగేట్ట. కొడుకు గర్వంగా, "ఆ జగన్నాథపురం జమీందార్‌గారి కడుపులో అల్సర్ ఆపరేషన్‌చేసి తీసేశాను నాన్నా" అన్నాట్ట. పెద్ద డాక్టరుగారు నిర్వీణ్ణుడై "అయ్యో! ఆ కేసు కాస్తా పోయిందా? దాంతోనే కదరా నీ ఎం. బి. బి. ఎస్. చదువుకి నిధులు సమకూరింది?" అన్నాట్ట. అల్లాగే, స్లమ్ క్లియరెన్సు అని ఒక ఆదర్శం పెట్టుకుంటాం. దానికి మందీ మార్బలం నిధులూ విధులూ ఏర్పరుస్తాం. అంతేగాని మురికివాడల్ని నిర్మూలిస్తామా?........ ఏం, మళ్ళీ ఎలెక్షన్స్‌లో గెలవాలని లేదా ఏమిటి?

"మనసులేని మార్గాల్లో మురికివాడల నిర్మూలనం వొక్కటే కాదు. పేటలకీ రోడ్లకీ పేర్లు పెట్టడం కూడా వస్తుంది" అని మా జగన్నాథరావుగారు నాతో తగువు కొచ్చేరొకనాడు.

"మీ కన్నీ అలాగే కనబడతాయి. ఏంటి బాబూ! మా వూళ్ళో మీకు నచ్చనివి?" అని యెదురు తిరిగాను.

"రెండు రోజులపాటు సిటీ బస్సులెక్కి తిరిగాను. మీ వూరి బస్‌స్టాప్‌లకి పెట్టిన పేర్లు అమోఘం; చావుల మదుం- గంజిపేట- బొమ్మల కొళాయి- రెల్లి వీధి- పందిమెట్ట- పిచ్చాసుపత్రి- కుళ్ళు కాలవ. ఆహా! ఏం పేర్లు పెట్టారండి!" అన్నారాయన; చేతులు తిప్పుతూ, కనుగుడ్లు మిటకరిస్తూ.

"అందుకేగా, మా రోడ్లకి కొత్త కొత్త పేర్లు పెట్టాం?" అన్నాను.

"అవీ చూశాన్లెండి. అవి కూడా అంతే సమంజసంగా వున్నాయి. గురజాడ అప్పారావు బొమ్మకింద రాజాజీ మార్గం! తెన్నేటి విశ్వనాథం బొమ్మ దగ్గిర రాజేంద్రప్రసాద్ మార్గం! ఏం, వాళ్ళ విగ్రహాలు పెట్టిన రోడ్లకైనా వాళ్ళ పేర్లు పెట్టకూడదుటండీ! అసలు మీ వూళ్ళో రోడ్ల పేర్లద్వారా గుర్తుంచుకోవలసిన పాటి గొప్పవాళ్లు పుట్టలేదా లేక మీకు తెలుగువాళ్ళు పనికి రారా? వాల్‌చంద్ హీరాచంద్ మార్గం! బిపిన్ చంద్రపాల్ మార్గం! ఇవన్నీ యేమిటని?"

"అన్నీ స్థానిక నామాలే అయితే బాగోదని—"

స్థానిక ప్రముఖుల పేర్లుకూడా రోడ్లమీద కొచ్చేటప్పటికి అపభ్రంశంగా తయారయ్యేయి. రామబ్రహ్మం మార్గం అనటానికి రాంబ్రహ్మం మార్గం అన్నారు. మారేపల్లి అనటానికి మాదేపల్లి అన్నారు. మీకే తెలియని మీ స్థానిక ప్రముఖుల్ని రోడ్లమీదికి ఈడ్చి ఇలా హింసించడం తగదు సుమండీ!"

"ఏదో ఆర్టిస్టు తప్పు రాసుంటాడు సార్! అనబోయి వూరుకున్నా.

"ఒక్కటి మాత్రం నాకు నచ్చింది. ఊరవతల ట్రంకురోడ్డులో కొంత భాగానికి అశోకమార్గం అని పేరెట్టారు.... హాట్సాఫ్!"

"ఎందుకు సార్, వేళాకోళం?" అన్నాను సగం చచ్చి.

"వేళాకోళం కాదు, నిజం! ఆ రోడ్డుకు రెండువైపులా నీడనిచ్చే భారీ వృక్షాలున్నాయి. చిన్నప్పుడు చదువుకోలేదూ అశోకుడు రోడ్లు వేయించెను; వాటి కిరువైపుల చెట్లు నాటించెను— అని! అదంతా గుర్తొచ్చి నాకు పరమ సంతోషమైంది."

(23-4-84)